శ్రామికులకు వ్యతిరేకంగా కేంద్ర బడ్జెట్

- రూ.55 లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.12 లక్షల కోట్లు వడ్డీలకే..
- రాష్ట్రంలోని బిజెపి ఎంపిలు, కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి : జాన్‌వెస్లీ
- కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో ఆందోళనలు
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం, బడ్జెట్ ప్రతుల దహనం

దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్లకు అనుకూలంగా.. శ్రామిక, బడుగు, బలహీన వర్గాలకు వ్యతిరేకంగా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. రూ.55.60లక్షల కోట్లకు పైగా రూపొందించిన బడ్జెట్‌లో రూ.12లక్షల కోట్లు కేవలం వడ్డీ చెల్లించడానికే పోతుందని తెలిపారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా సోమవారం సిపిఎం దేశవ్యాప్త పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం, బడ్జెట్ ప్రతుల దహనం చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని నిర్మల్ హృదయ్ స్కూల్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వం, మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. కోట్లాది మంది ఉపాధి కూలీలు పొట్టగడవడానికి నిధులు కేటాయించాలని రూ.రెండు లక్షల కోట్లు అడిగితే రూ.85వేల కోట్లకు దాన్ని పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక, అసంఘటిత రంగాలకు నిధులు కేటాయించలేదన్నారు. రైతాంగాన్ని ఆదుకోవడానికి కావాల్సిన ఎలాంటి ప్రతిపాదనలు బడ్జెట్‌లో లేవన్నారు. వ్యవసాయ సబ్సిడీలకు కోత పెట్టారని, ఎరువుల రాయితీలో రూ.11వేల కోట్లు కోతపెట్టారని తెలిపారు. శ్రామికులు, దళితులు, గిరిజనులకు వ్యతిరేకంగా ఈ బడ్జెట్ ఉందన్నారు. 16 శాతంగా ఉన్న దళిత జనాభాకు 5శాతం, 7శాతంగా ఉన్న గిరిజనులకు 2శాతం నిధులు కూడా కేటాయించలేదని చెప్పారు. మైనార్టీల సంక్షేమానికి కేవలం రూ.మూడు వేల కోట్ల నిధులకు పరిమితం చేశారన్నారు. విద్యావైద్యానికి కలిపి 25 శాతం నిధులు కావాలని కోరుతుంటే దాన్ని నాలుగు శాతానికే పరిమితం చేసి వాటిని వ్యాపారమయంగా మార్చేందుకు పూనుకుంటున్నారని అన్నారు. సంక్షేమ పథకాలన్నింటినీ కుదించి వేసిందని, ఎస్సి, ఎస్టిలకు ఇచ్చే సంక్షేమ పథకాలకూ నిధులే కేటాయించటం లేదని విమర్శించారు. తెలంగాణపై కేంద్రం బడ్జెట్‌లో వివక్ష చూపిందని అన్నారు. రాష్ట్ర విభజన ఒప్పందాలకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. హైదరాబాద్ మెట్రో రెండో లైన్‌కు నిధులు కేటాయించలేదని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఊసే లేదన్నారు. పార్టీలకు అతీతంగా కేంద్ర బడ్జెట్‌ను రాష్ట్ర ప్రజానీకం వ్యతిరేకించాలన్నారు. బిజెపి ఎంపీలు రాష్ట్రం నుంచి ఎనిమిది మంది, వారిలో ఇద్దరు మంత్రులున్నా రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో ఎలాంటి ప్రయత్నం జరగలేదన్నారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్రమంత్రులు వెంటనే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను పున:సమీక్షించి తెలంగాణకు ఇవ్వాల్సిన నిధులను కేటాయించాలని తెలిపారు. సరైన కేటాయింపులు జరిగేంత వరకు ఆందోళన, పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, పోతినేని సుదర్శన్‌రావు, జూలకంటి రంగారెడ్డి, మల్లులక్ష్మి, జహంగీర్, నున్నా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మధిరలో పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సెంటర్‌లో బడ్జెట్ ప్రతులు దహనం చేశారు. ఎర్రుపాలెంలోని రింగ్ సెంటర్‌లో మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. బూర్గంపాడులో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులు దహనం చేశారు. మణుగూరు, టేకులపల్లి, ఇల్లందులో సిపిఎం ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రులు దహనం చేశారు.

హైదరాబాద్‌లో..

సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, రైతులకు, కార్మికులకు, పేద ప్రజానీకానికి వ్యతిరేకంగా ఉందన్నారు. బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐలు తీసుకురావాలని బడ్జెట్‌లో ప్రవేశపెట్టడం దారుణమన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. తెలంగాణ బిజెపి ఎంపిలు తక్షణమే నిధులు తెస్తారా లేక రాజీనామ చేస్తారా ఆలోచించుకోవాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.జ్యోతి మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడా కార్పొరేట్ సంస్థలను కాపాడే విధంగా ఉందన్నారు. పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కమిటీ చైర్మెన్ డీజీ నర్సింహారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కుబడి పోరాటాలు కాకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడాలన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయం మీద సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే తెలంగాణ బంద్ నిర్వహించి ఢిల్లీలోని మోడీ ప్రభుత్వం కండ్లు తెరిపించాలన్నారు.

నిజామాబాద్, బోధన్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన చేపట్టారు. నల్లగొండ జిల్లా గట్టుప్పల్, చండూరు, వేములపల్లి, తిప్పర్తి మండలకేంద్రాల్లో సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గరిడేపల్లి మండలం వెలిదండ బస్టాండ్ సెంటర్‌లో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మెదక్ పట్టణంలోని పోస్టాఫీస్ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్, లో సిపిఎం ఆధ్వర్యంలో కాటేదాన్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కందుకూరులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. నిర్మల్‌లో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

మహిళా సాధికారితతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని వుమెన్ ఎంట్రప్రెన్యూర్స్ హబ్ (విహబ్)ను ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి గవర్నర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మహిళా సాధికారత లేకుండా స్థిరమైన భవిష్యత్‌ను ఊహించలేము. మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది. మహిళా పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కావాలి" అని గవర్నర్ పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధిలో తెలంగాణ ముందంజలో ఉందని అన్నారు. మహిళాశక్తి, మహాలక్ష్మి పథకాలు, స్కిల్ యూనివర్సిటీ ద్వారా వారికి అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచి వచ్చిన మహిళలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి హబ్ సిఇఒ సీతా పల్లచోల్లాతో పాటు పలువురు మహిళా పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

డిటిసిసి నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఎఐ యూనివర్సిటీతో పెరగనున్న తెలంగాణా ప్రతిష్ట

- ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

కృతిమ మేధ (ఎఐ) యూనివర్సిటీ ఏర్పాటుతో తెలంగాణ ప్రతిష్ట మరింత పెరగనుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీలో డిపాజిటరీ ట్రస్ట్, క్లియరింగ్ కార్పొరేషన్ (డిటిసిసి) నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ యువతను ఈ రంగంలో నిపుణులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో దీన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. "ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామిక వేత్తలను ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా ప్రోత్సహిస్తాం. నిర్వహణలో సంబంధిత పరిశ్రమలు, నిపుణులను భాగస్వామ్యం చేస్తాం. రాబోయే రోజుల్లో ఎఐ అంటే తెలంగాణా... హైదరాబాద్ గుర్తుకు వచ్చేలా దాన్ని తీర్చి దిద్దుతాం" అని పేర్కొన్నారు. "రోజురోజుకీ టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోంది. అదే సమయంలో కొత్త కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. యువత కొత్తగా ఆలోచించి వీటికి పరిష్కారాలను కనుగొనడంతో పాటు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి. ఆ దిశగా కృషి చేసే వారికి ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటాం" అని హామీ ఇచ్చారు. "హైదరాబాద్ అనగానే అందరికీ కేవలం సాఫ్ట్ వేర్ కంపెనీలే గుర్తుకొస్తాయి. కానీ.. ఇక్కడ అన్ని రంగాలకు చెందిన కంపెనీలున్నాయి. 100 నుంచి 120 కంపెనీలు ఇక్కడి నుంచే ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సేవలందిస్తున్నాయి. అన్ని రకాల పరిశ్రమలను స్థాపించేందుకు అనువైన వాతావరణం తెలంగాణలో ఉంది. ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటాం. మీకు కావాల్సిన నైపుణ్యమున్న మానవ వనరులను మేం అందిస్తాం. నిశ్చింతంగా ఇక్కడ పెట్టుబడులు పెట్టండి" అని కోరారు. ఈ కార్యక్రమంలో డిటిసిసి చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రెనీ లారోకే మోరీస్, చీఫ్ ఇన్‌ఫర్మేషన్ అధికారి లిన్ బిషప్ తదితరులు పాల్గొన్నారు

జ్ఞాన సరస్వతి దేవాలయంలో వసంత పంచమి

ప్రజాశక్తి కల్చరల్

చదువుల తల్లి గా భావించే సరస్వతి దేవీ జన్మ నక్షత్రం వసంత పంచమి కాగా ముషీరాబాద్ వద్ద నున్నశృంగేరి జ్ఞాన సరస్వతి దేవాలయం లో సోమవారం హెూమం ఇతర వేద కార్యక్రమాలు శాస్త్ర బద్ధంగా జరిగాయి పదకొండు వందల పైగా పిల్లల అక్షరాభ్యాసము జరిగినట్లు శృంగేరి పీఠం జ్ఞాన సరస్వతి దేవాలయం ధర్మాధికారి కళా జనార్ధన మూర్తి తెలిపారు. వేల మంది అమ్మవారి దర్శనం కోసం వచ్చినప్పటికీ ఎట్టి తొక్కిస లేకుండా భక్తులు అందరూ దర్శనం చేసుకున్నారు అని సహకరించిన పోలీస్ అధి కారులు సిబ్బందికి అయన ధన్య వాదాలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లు షురూ

మొదటి రోజు బరిలో 10 మంది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల పర్వం మొదలైంది. సోమవారం మొదటి రోజు మొత్తం 10 మంది అభ్యర్థులు 13 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. అత్యధికంగా మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గానికి ఆరుగురు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. వరంగల్-కరీంనగర్-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఒక నామినేషన్ దాఖలైంది. ఈ మేరకు తెలంగాణ ఎన్నికల ఒక ప్రకటన విడుదల చేసింది.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యి

- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో నిరసనలు
- ఖమ్మంలో మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్ష చూపడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 - 26 బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని, సీఎం రేవంత్.. ఢిల్లీలో ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేసినా వివక్ష చూపారని తెలిపారు. బీజేపీ పాలిత ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. మోడీ సర్కార్ బడ్జెట్‌లో రాజకీయ ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. పోలవరం మాదిరి తెలంగాణలో సాగు నీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వలేదని, తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు, విమానాశ్రయాలు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీలకు నిధులు కేటాయించలేదని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో అంబేద్కర్ విగ్రహం స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఇల్లందులో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతి ఇచ్చారు. సంగారెడ్డిలో అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించి ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం వెలిదండ బస్టాండ్ సెంటర్‌లో ప్రధానమంత్రి మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు.

మంచు' పంచాయితీ..!

తెగని 'మంచు' పంచాయితీ..!

- రంగారెడ్డి కలెక్టరేట్‌కు తండ్రీకొడుకులు
- ఇరువురిని విచారించిన అదనపు కలెక్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సినీ నటుడు మోహన్‌బాబు కుటుంబ పంచాయితీ ఇప్పట్లో తెగేలా కనిపించడం లేదు. ఆస్తి విషయంలో తండ్రీకొడుకులకు గొడవలు చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. వీరి కేసు విచారణ నేపథ్యంలో సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు మోహన్‌బాబు, మనోజ్ రావడంతో వీరి కుటుంబ వ్యవహారం మరోసారి తెర మీదికి వచ్చింది. వీరిని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ విచారించారు. గత నెలలో మోహన్‌బాబు వయో వృద్ధుల చట్టం కింద జిల్లా మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి.. మంచు మనోజ్‌కు నోటీసులు ఇచ్చారు. కలెక్టర్ నోటీసులు అందుకున్న మనోజ్.. జనవరి 18న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఎదుట హాజరయ్యారు. ఈ క్రమంలో మనోజ్ వివరణ ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని అడిగారు. అతను అడిగిన సమయం ముగియడంతో సోమవారం మధ్యాహ్నం రెండోసారి మంచు కుటుంబ సభ్యులు విచారణకు హాజరయ్యారు. ఈ విచారణలో తండ్రి, కొడుకు ఇద్దరూ వేర్వేరు వాహనాల్లో తమ న్యాయవాదులతో కలిసి రంగారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చారు. ఇరువురిని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ విడివిడిగా మొదట విచారించారు. తరువాత ఇద్దరిని కుర్చోపెట్టి సుమారు రెండు గంటల పాటు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఇరువురు కలెక్టర్ ఎదుటే వాగ్వాదానికి దిగినట్టు విశ్వసనీయ సమాచారం. ప్రతిమాసింగ్ వారిని సముదాయించే ప్రయత్నం చేసినా.. విన్పించుకోకపోవడంతో రక్షణ కోసం పోలీసులను లోపలికి పిలిపించారు.

"ఇళ్లు, ఇతర ఆస్తులన్నీ నా కష్టార్జితం. వాటి నుంచి ఖాళీ చేయించాల్సిందే" అంటూ మోహన్‌బాబు విచారణ అధికారి ఎదుట పట్టుబట్టగా, మనోజ్ ఇందుకు నిరాకరించినట్టు తెలిసింది. "కూర్చొని మాట్లాడుకోవాలని, నాన్నకు ఇళ్లు ఒక్కటే కాదని, చాలా ఆస్తులు ఉన్నాయని, వారసత్వంగా తనకు ఆస్తిలో వాటా ఉందని, విద్యా సంస్థల్లో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించినందుకే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, తాను ఏనాడు కూడా నాన్నపై చేయి చేసుకోలేదని" మనోజ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది.

"అతను నా కొడుకే కాదు.. అతని నుంచి నాకు ప్రాణహాని ఉంది. నాకు రక్షణ కల్పించండి" అంటూ మోహన్ బాబు మేజిస్ట్రేట్‌కు విన్నవించినట్టు సమాచారం. ఇదిలా ఉంటే పలు ఆస్తులకు సంబంధించిన దస్తావేజులను మనోజ్ విచారణాధికారికి అందజేశారు. అనంతరం మోహన్‌బాబు వెనుక వైపు నుంచి వెళ్లిపోగా, మనోజ్ ముందు వైపు నుంచి ఆవేశంగా బయటికి వెళ్లిపోయారు.

తస్వ నుంచి ప్రత్యేక వెడ్డింగ్ కలెక్షన్

హైదరాబాద్ : ప్రీమియం సంప్రదాయ మెన్స్ వేర్ బ్రాండ్ తస్వ కొత్తగా 'గ్రాండ్ వెడ్డింగ్ 25' కలెక్షన్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఇందుకోసం ప్రఖ్యాత డిజైనర్ తరుణ్ తహిలియాని సహకారంతో బెంగళూరుతో ఒక ఎక్స్‌క్లూజివ్ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. రాబోయే రోజుల్లో దక్షిణాదిలో ఇలాంటి మరిన్ని ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఈ కలెక్షన్‌లో అప్లిక్యూ, ముత్యాల అలంకరణలు, 3డి డిటెయిలింగ్ కూడా ఉన్నాయని తస్వా చీఫ్ డిజైన్ ఆఫీసర్ తరుణ్ తహిలియాని పేర్కొన్నారు.

సన్‌ఫీస్ట్ నుంచి 'వావ్జర్స్' బ్రాండ్

హైదరాబాద్ : ప్రముఖ ఎఫ్‌ఎంసిజి కంపెనీ ఐటిసికి చెందిన సన్‌ఫీస్ట్ సంస్థ కొత్తగా 'వావ్జర్స్' బ్రాండ్ బిస్కట్లను విడుదల చేసినట్లు ప్రకటించింది. 16 గ్రాముల ప్యాక్ ధరను రూ.5గా, 128 గ్రాముల ప్యాక్ ధను రూ.60గా నిర్ణయించినట్లు ఐటిసి లిమిటెడ్ బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్ సిఇఒ అలీ హారిస్ షేర్ తెలిపారు.
సన్‌ఫీస్ట్ వావ్జర్స్ అసాధారణమైన 14 లేయర్ పరిపూర్ణమైన క్రాకర్ డిజైన్‌ను కలిగి ఉందన్నారు. దీంతో అభివృద్ధి చెందుతున్న చెందుతున్న వినియోగదారుల ప్రాధాన్యతలను తీరుస్తామన్నారు.

తెలంగాణ అంగన్వాడీ కేంద్రాలకు నిధులు పెంచండి

- ప్రతిపాదిత అల్పాహార పథకానికి సహకరించండి
- కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవిని కోరిన మంత్రి డాక్టర్ సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని అంగన్వాడీ కేంద్రాలకు నిధులను పెంచాలనీ, రాష్ట్రంలో ప్రతిపాదిత బ్రేక్ ఫాస్ట్ పథకానికి సహకరించాలని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవిని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో ఆమెతో సీతక్క భేటీ అయ్యారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల కోసం అల్పాహార పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పించారు. రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతమున్న మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరాన్ని వివరించారు. మంత్రి సీతక్క వెంట టీజీ ఫుడ్స్ చైర్మెన్ ఎంఏ. ఫహీం, మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ కాంతి వెస్లీ ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అంగన్వాడీల్లో ప్రస్తుతం 35,700 మంది పనిచేస్తున్నారనీ, ఫలితంగా ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీమ్ (ఐసిడిఎస్) ద్వారా మహిళలు, పిల్లలకు సంపూర్ణ పోషణను అమలు చేయడంలో తెలంగాణ అగ్రగామిగా ఉందని కేంద్ర మంత్రి దృష్టికి సీతక్క తీసుకెళ్లారు. మూడు నుంచి ఆరేండ్ల వయస్సు గల 8.6 లక్షల మంది పిల్లలకు సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం ద్వారా పూర్తి వేడి భోజనంతో పాటు గుడ్డు, స్నాక్స్ కు చిన్నారులకు అందజేస్తున్నామని వివరించారు. వివిధ కారణాల వల్ల కరోనా తర్వాత పలువురు చిన్నారులు పోషకార లోపంతో బాధపడుతున్నారని చెప్పారు. అందుకే అంగన్వాడీ చిన్నారుల పోషణను మెరుగుపరిచేందుకు అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టాలని తమ ప్రభుత్వం భావిస్తున్నదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపాదిత బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేస్తే చిన్నారులు ప్రతిరోజూ అదనపు పోషకాహారం అందుకుంటారనీ, చిన్నారులు ప్రీ-స్కూళ్లకు క్రమం తప్పకుండా హాజరవుతారని వివరించారు. ఒక్కో చిన్నారికి రోజుకు అల్పాహారం కోసం రూ. ఎనిమిది చొప్పున ఏడాదికి రూ. 206 కోట్లు ఖర్చవుతాయని ప్రస్తావించారు. ఆ పథకం అమలు కోసం కేంద్ర ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బ్రేక్ ఫాస్ట్ స్కీం ప్రతిపాదనను కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి ప్రశంసించారని సీతక్క తెలిపారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో చర్చించి నిధులు మంజూరుకు కృషిచేస్తామని హామీనిచ్చారని చెప్పారు. త్వరలో తెలంగాణలో పర్యటించి..మహిళా శిశు సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను అధ్యయనం చేస్తామని కేంద్ర మంత్రి చెప్పారని వివరించారు. నిధుల విడుదల సహకరిస్తామని హామీనిచ్చిన అన్నపూర్ణాదేవికి సీతక్క ధన్యవాదాలు తెలిపారు.

20న ఎప్‌సెట్ నోటిఫికేషన్

- 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 29 నుంచి మే 5 వరకు రాతపరీక్షలు
- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) నోటిఫికేషన్ ఈనెల 20న విడుదల కానుంది. సోమవారం ఎప్‌సెట్ కమిటీ మొదటి సమావేశాన్ని హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఉన్న జెఎన్‌టియు హైదరాబాద్‌లో నిర్వహించారు. ఉన్నత విద్యామండలి చైర్మెన్, జెఎన్‌టియు హైదరాబాద్ విసి, ఎప్‌సెట్ చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మెన్లు ఈ పురుషోత్తం, ఎస్‌కె మహమూద్, కార్యదర్శి శ్రీరాంవెంకటేశ్, ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి, సభ్యులు ఎస్ తారాకళ్యాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎప్‌సెట్ కన్వీనర్ డీన్‌కుమార్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 20న నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని తెలిపారు. 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు. ఆలస్య రుసుం లేకుండా వాటి సమర్పణకు తుది గడువు ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం నుంచి వంద శాతం సిలబస్‌ను ఉపయోగించి ఎప్‌సెట్ ప్రశ్నాపత్రాలను రూపొందిస్తామని స్పష్టం చేశారు. ఏప్రిల్ 29 నుంచి మే ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఏప్రిల్ 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు, మే రెండు నుంచి ఐదో తేదీ వరకు ఇంజనీరింగ్ విభాగం పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం ఈ నెల 20 నుంచి https://eapcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

అతి తక్కువ ఖర్చుతో హెచ్‌పివి వ్యాక్సిన్

- బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి నాలుగు నుంచి 28 వరకు అతి తక్కువ ఖర్చుతో హెచ్ పివి వ్యాక్సిన్‌ను అందజేయనున్నట్టు బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి రోజు ఉదయం పది గంటల నుంచి ఒంటి గంట వరకు క్యాన్సర్ వైద్య నిపుణులచే ఉచిత తప్రాథమిక పరీక్షలు, 20 శాతం తగ్గింపుతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు, రూ. నాలుగు వేల ఖరీదైన డోసు ఒక్కదాన్ని రూ.1,,500కే ఇవ్వనున్నట్టు చెప్పారు. తొమ్మిది సంవత్సరాల నుంచి 14 ఏండ్లలోపు ఆడపిల్లలు ఆరు నెలల వ్యవధిలో రెండు డోసులు, 15 ఏళ్ల నుంచి 26 ఏళ్ల వయస్సున్న యువతులకు ఆరు నెలల వ్యవధిలో మూడు డోసులు వ్యాక్సిన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఫిబ్రవరి మాసంలో మొదటి డోసు తీసుకున్న వారికే ఈ తగ్గింపు వర్తిస్తుంది. ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలనుకునే వారు హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రిని సంప్రదించాలని సూచించారు.

మార్చి ఆరు నుంచి టెన్త్ ప్రీఫైనల్ పరీక్షలు

- సవరణ టైంటేబుల్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పదోతరగతి ప్రీఫైనల్ పరీక్షలు వచ్చేనెల ఆరో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అదేనెల 15 వరకు నిర్వహిస్తారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి సోమవారం సవరణ టైంటేబుల్‌ను విడుదల చేశారు. పదోతరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు మధ్యాహ్నం 12.15 నుంచి 3.15 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. గతంలో మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4.15 వరకు నిర్వహించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. రంజాన్ పండగ నేపథ్యంలో పరీక్షల సమయంలో మార్పులు చేశామని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 12.15 గంటల కంటే ముందే మధ్యాహ్న భోజనం అందించాలని తెలిపారు. ఆర్‌జెడిలు, డిఇఒలు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

మార్చి 12న పిజిఇసెట్ నోటిఫికేషన్

- 17 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- సమర్పణకు తుది గడువు మే 19
- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

రాష్ట్రంలో ఎంఈ/ఎంటెక్‌తోపాటు ఎంఫార్మసీ, ఎంఆర్క్, ఫార్మా-డి (పీబీ)కోర్సుల్లో 2025-26విద్యాసంవత్సరంలో ప్రవేశాలకోసం నిర్వహించే పోస్టు గ్రాడ్యుయెట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పిజిఇసెట్) నోటిఫికేషన్ మార్చి 12న విడుదల కానుంది. సోమవారం హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఉన్న జెఎన్‌టియు హైదరాబాద్‌లో పిజిఇసెట్ కమిటీ మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఉన్నత విద్యామండలి చైర్మెన్, జెఎన్‌టియు హైదరాబాద్ విసి, పిజిఇసెట్ చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మెన్లు ఈ పురుషోత్తం, ఎస్‌కె మహమూద్, కార్యదర్శి శ్రీరాంవెంకటేశ్, పిజిఇసెట్ కన్వీనర్ ఎ అరుణకుమారి, కోకన్వీనర్ బి రవీంద్రారెడ్డి, కోఆర్డినేటర్ టి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పిజిఇసెట్ కన్వీనర్ ఎ అరుణకుమారి పిజిఇసెట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. 12న నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని తెలిపారు. అదే నెల 17 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆలస్య రుసుం లేకుండా వాటి సమర్పణకు తుది గడువు మే 19 వరకు ఉందని వివరించారు. జూన్ 16 నుంచి 19 వరకు పిజిఇసెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం వచ్చేనెల 12 నుంచి https://pgecet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

PUBLIC NOTICE

My Client **Sri. GAJAM ANJAIAH,** S/o. Late Gajam Narasimha, aged about 69 years, residing at No. 11-7-140/3 A-36, Huda Colony, Saroor Nagar, Kothapet, Hyderabad, Telangana - 500035, is the absolute owner and in peaceful possession and enjoyment of the Schedule Property more fully described in the Schedule herein below.
The Public are hereby informed that the Original Sale Deed dated 16/04/2005, registered as Document No. KRI-1-02138/2005-06, Book-1, registered in the office of the Senior Sub-Registrar, K.R. Puram, executed by Sri. C. Venkataswamy and Others in favour of my client and Khata No.164/10, both Documents in respect of the Schedule Property was in my client's custody and the same has been lost / misplaced during his commute to Bengaluru on 25/01/2025.
My Client has also lodged a Police Complaint / Lost Article Report before the jurisdictional police on 02/02/2025 and the same is registered as Lost Report No. 1458804/2025.
The public are hereby requested to notify me / my client and handover the aforesaid Original Sale Deed dated 16/04/2005, registered as Document No. KRI-1-02138/2005-06, Book-1, registered in the office of the Senior Sub-Registrar, K.R. Puram and Khata No.164/10, to me / my client, if found.

SCHEDULE

All that piece and parcel of the property bearing Sy.No.62/2, Municipal No.10, Khata No.164/10, situated at Nallurahalli Village, K.R. Puram Hobli, Bengaluru East Taluk, measuring 1 Acre 8 Guntas converted for residential purposes vide Official Memorandum bearing No. B.Dis.ALN.(E)SR(KH)59/07-08, dated 22/10/2008 issued by the Special Deputy Commissioner, Bengaluru District, bounded on: East by : Sy.No. 62/3, West by : Sy.No.63, North by : Sy.No. 62/1 and Road, South by : Halla or Rajakaluve.

MAHESH REDDY G, Advocate
No.27, Indo Legal Inc, 9th Cross,
Wilson Garden, Bengaluru - 560027.
Mobile : 9035323514, 8618853779
Email : maheshradvocate@gmail.com

ముగ్గురు ఉపాధ్యాయుల సస్పెండ్

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలో నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయునితో పాటు ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్టు ఫిర్యాదులు రావడంతో సదరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు ఎం.కిషన్‌రావు, ఇద్దరు ఉపాధ్యాయులు ఎ.మనోహర్‌రెడ్డి, ఎ.మోహన్‌రావును సస్పెండ్ చేసినట్టు తెలిపారు. ఈ ఘటనపై శాఖాపరమైన విచారణ కొనసాగుతోందని, ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

15న సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి

- సిఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

మహనీయ సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 15న సాధారణ సెలవు లేదా ప్రత్యేక సీఎల్‌గా ప్రకటించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన సోమవారం లేఖ రాశారు. సేవాలాల్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని బంజారాభవన్‌లో సీఎం పాల్గొన్నారని గుర్తు చేశారు. గతేడాది ఫిబ్రవరి 15న ప్రత్యేక సీఎల్ ప్రభుత్వం ప్రకటించిందని వివరించారు. ఈ ఏడాది కూడా సాధారణ సెలవు లేదా ప్రత్యేక సీఎల్‌ను మంజూరు చేయాలని కోరారు.

ఎక్సైజ్‌కు మంత్రి ఉన్నాడు.. ఎడ్యుకేషన్‌కు మంత్రి అవసరం లేదా?

- గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో దయనీయ పరిస్థితులు
- విద్య కాషాయీకరణ దిశగా బిజెపి అడుగులు : తాళ్ల నాగరాజు

బహిరంగ సభలో మాట్లాడుతున్న తాళ్ల నాగరాజు

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

'మార్పు కోసం రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తే.. ఆ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. మద్యం అమ్మకాల కోసం పక్కా ప్రణాళికలు రూపొందిస్తూ ఎక్సైజ్ శాఖకు మంత్రిని నియమించి మరీ ఆదాయం గడిస్తున్న ప్రభుత్వం భావితరాలను అందించే విద్యాశాఖకు మంత్రి అవసరం లేదా? రాష్ట్రంలో వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదు. మెస్‌చార్జీలు పెంచామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌కు గురవుతున్నారు. ఇంకోవైపు కేంద్రంలో బిజెపి సర్కారు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకుండా విద్య కాషాయీకరణ చేసే దిశగా అడుగులు వేస్తోంది' అని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సంఘం కరీంనగర్ జిల్లా 18వ మహాసభ సోమవారం జిల్లా కేంద్రంలో ప్రారంభమైంది. ఉదయం నగరంలోని తెలంగాణ చౌక్ నుంచి కళాభారతి వరకు విద్యార్థులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కళాభారతి భవన్‌లో నిర్వహించిన బహిరంగ సభలో తాళ్ల నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగరపు రజనీకాంత్ ప్రసంగించారు.

రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని నియమించకుండా, ఆ శాఖను తన దగ్గరే పెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికే పాఠశాల విద్య మొదలుకుని ఉన్నత విద్యవరకూ తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంతో విద్యార్థులకు టిసి, ఇతర సర్టిఫికెట్లు కోసం ప్రయివేటు కాలేజీ యాజమాన్యాలు వేధిస్తున్నాయని, వాళ్లను ప్రశ్నిస్తే నిధులు రాకుండా తాము కాలేజీలు ఎలా నిర్వహించేదంటూ బదులిస్తున్నారని అన్నారు. ఈ విషయమై గతంలోనే ప్రయివేటు కాలేజీల బంద్‌కు పిలుపునిస్తే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విడతలవారీగా పెండింగ్‌లోని రూ.8200కోట్లు నిధులు చెల్లిస్తామని టోకెన్లు ఇచ్చారని, కానీ వాటి సంగతే మరిచిపోయారని అన్నారు. ఇప్పటికే వనపర్తి జిల్లాలో ఓ విద్యార్థి పీజీ కోర్సులో చేరేందుకు కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన తెలిసిందేనన్నారు. బకాయిలు రానందున మరికొద్ది రోజుల్లో కాలేజీలు బంద్‌కు సిద్ధమవుతున్నాయని, ఇదే కొనసాగితే భవిష్యత్‌లో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అయ్యే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ అయి ఇప్పటికే 50 మంది విద్యార్థులు చనిపోయారని, ఎంతోమంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. మెస్‌చార్జీలు పెంచామని చెబుతున్న ప్రభుత్వం ఈ మరణాలకు ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. జైల్లో ఉండే ఖైదీకి రోజుకు రూ.87.30 పైసలు ఇస్తుంటే విద్యార్థులకు మాత్రం రూ.57.30మాత్రమే ఇస్తోందని వివరించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం విద్యావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ విద్యా కాషాయికరణను ప్రోత్సహిస్తూ మతకల్లోలాలు సృష్టిస్తోందన్నారు. నూతనంగా తీసుకొస్తున్న యూనివర్సిటీ లలో మార్గదర్శకాలను రద్దు చేయాలని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కోల్పోయే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలున్నాయని వివరించారు. కనీసం కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ జిల్లా మహాసభల్లో విద్యారంగ సమస్యలపైనచర్చించి భవిష్యత్ పోరాటాలను రూపొందించుకోవాలని సూచించారు. ఈ సభలో ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ కన్వీనర్ మక్కపెల్లి పూజ, జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు అభిలాష్, రోహిత్, ఈశక్, సహాయ కార్యదర్శులు బొగేశ్, శ్రీజ, నాయకులు రాజు, సన్నీ, రిషికేశ్, ఆకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం భట్టికి వినతిపత్రం అందజేస్తున్న బిసి కమిషన్ అధికారులు

బిసి కమిషన్‌కు మరిన్ని అధికారాలివ్వాలి

- డిప్యూటీ సిఎం భట్టికి విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి కమిషన్‌కు మరిన్ని అధికారాలు కల్పిస్తూ చట్ట సవరణ చేయాల్సిన అవసరముందని ఆ కమిషన్ కోరింది. ఇదే అంశంపై సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో బిసి కమిషన్ చైర్మన్, సభ్యులు చర్చించారు. బిసి కమిషన్ పది ఉమ్మడి జిల్లాల పర్యటన తరువాత వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఇప్పటికే కొన్ని కులాల పేర్ల మార్పుతో పాటు అభ్యంతరాల స్వీకరించిన తరువాత వచ్చిన అన్ని అంశాలను పరిశీలించాయి. వీటిపై చైర్మన్‌తో పాటు నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మీ రంగు చర్చించారు.

దళిత మహిళ దారుణ హత్య

- దోషులను కఠినంగా శిక్షించాలి : ఐద్వా

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య జిల్లాలో జనవరి 30న దళిత యువతిపై అత్యంత దారుణంగా లైంగిక దాడి చేసి హత్య చేయటం దుర్మార్గమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటి ఖండించింది. ఈ మేరు సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి ఆ కిరాతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అయోధ్య జిల్లాకు చెందిన 22 ఏండ్ల యువతి భజన కార్యక్రమానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి వెళ్ళిందనీ, ఆ యువతి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఈ ఘటన వెలుగులోకొచ్చిందని తెలిపారు. యువతిని తాళ్లతో కట్టేసి దారుణంగా లైంగిక దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఆ తర్వాత ఆమె కనుగుడ్లు పీకి చేతులు విరిచి దుర్మార్గంగా ప్రవర్తించారని తెలిపారు. స్థానిక ఎంపీ అవదేశ్ ప్రసాద్ కూతుళ్ళను రక్షించలేకపోతున్నామంటూ భావోద్వేగానికి గుర్తై పదవికి రాజీనామా చేస్తానని అన్నారంటే ఘటన తీవ్రతను అర్థం చేసుకోవచ్చని తెలిపారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలకు , బాలికలకు భద్రత లేక క్షణ,క్షణం భయం భయంగా బ్రతుకుతున్నారని పేర్కొన్నారు. స్త్రీలకు రక్షణ కల్పించలేని యూపీ రాష్ట్ర ప్రభుత్వాన్ని భర్త రఫ్ చేయాలనీ, హత్యకు కారకులైన వారిపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సాంస్కృతిక కార్యక్రమానికి అనుమతిపై పున:సమీక్షించాలి

- లక్ష డప్పులు, వేయి గొంతుకలు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు
- ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిక

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

లక్ష డప్పులు, వేయి గొంతుకల సాంస్కృతిక కార్యక్రమానికి అనుమతిపై సిఎం, డిజిపి, హైదరాబాద్ సిపి పున:సమీక్షించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అన్నారు. ఈ కార్యక్రమం ప్రభుత్వానికి వ్యతిరేకంగా భావించొద్దన్నారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఏ రోజూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పని చేయదన్నారు. తమకు వారసత్వంగా వచ్చిన కుల వృత్తి చెప్పులు కుట్టడం ఎప్పుడో మాదిగలకు దూరం అయిందని, మిగిలింది మాదిగల డప్పు వాయిద్యాలేనని అన్నారు. మాదిగల సాంస్కృతిక వాయిద్యమైన డప్పులు కూడా కాలక్రమేనా దూరం అవుతున్నాయని, కానీ ప్రతి ఉద్యమంలో ప్రతి ఊరిలో తమ మాదిగ డప్పు కీలకంగా మారిందని చెప్పారు. పల్లెల్లో కనుమరుగవుతున్న డప్పులు మళ్లీ జీవం పోసుకోవాలన్న ఉద్దేశంతో ఈ లక్ష డప్పులు, వేయి గొంతుకల కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి అనుమతి కోసం మరోసారి ఉన్నత స్థాయి అధికారులను కలవడానికి వెళ్లి విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలందరూ క్రమశిక్షణతో ఉన్నారని, వారు పూర్తిగా నాయకత్వం మాటకు కట్టుబడే ఉంటారని అన్నారు. అయితే అసాంఘిక శక్తులు చొరబడే ప్రమాదం ఉందని, అలా జరిగితే అది ఎవరు చేస్తారో కనిపెట్టే బాధ్యత ఇంటెలిజెన్స్, ప్రభుత్వానిది అని అన్నారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్, జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాదిగ, నాయకులు పృథ్వీరాజు యాదవ్, మాదిగ కళానాయకులు దరువు ఎల్లన్న మాదిగ, సీనియర్ జర్నలిస్ట్ ఇస్మాయిల్, రెడ్డి జాగృతి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాదిగ మేధావులు ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు అర్రెపల్లి రాజేందర్, ఎంఎస్‌పి జాతీయ నాయకులు నరేంద్ర బాబు మాదిగ, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు నరసింహ మాదిగ ఉన్నారు.

ఎఫ్‌డిఐ పరిమితిని వంద శాతానికి పెంచడం తగదు

- ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఫారీన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్- ఎఫ్‌డిఐ)ను 74 శాతం నుంచి 100 శాతానికి పెంచడం తగదని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) ఖండించింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పెంపుతో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిని దెబ్బతీస్తుందని, మన వనరులపై దుష్ప్రభావం ఉంటుందని తెలిపారు. 74 శాతం వరకే ఒక్కటి తప్ప మరే కంపెనీ చేరుకోలేదని, ఈ నేపథ్యంలో వంద శాతం పెంచాల్సిన అవసరమే లేదని స్పష్టం చేశారు. దేశీయ పొదుపులపై విదేశీ బీమా సంస్థలకు ఆర్థిక, సామాజిక అవగాహన ఉండదని తప్పుపట్టారు. దేశీయ పొదుపులపై నియంత్రణ ప్రభుత్వ అధీనంలోనే కొనసాగించేలా, పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు అనుకూలంగా ఇన్సూరెన్స్ యాక్ట్ 1938, ఎల్ఐసీ యాక్ట్ 1956, ఐఆర్డీఏ యాక్ట్ 1999 సవరణకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని, వెంటనే ప్రజాభిప్రాయాన్ని గౌరవించి ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

దమ్ముంటే శివారెడ్డిపల్లికి రావాలి

- కెటిఆర్‌కు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సవాల్

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

అదే పనిగా అబద్ధాలు చెబుతుంటే ప్రజలు బయట తిరగనివ్వరని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కెటిఆర్‌కు దమ్ముంటే శివారెడ్డి పల్లికి రావాలని సవాల్ విసిరారు. సమాచారం హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నా, అగ్రికల్చర్ డైరెక్టర్ గోపీకి దరఖాస్తు చేసుకున్నా పరిగి నియోజకవర్గంలో రూ.1,000 కోట్లు రుణమాఫీ అయిన విషయం తెలుస్తుందని చెప్పారు. శివారెడ్డిపల్లిలో బిఆర్ఎస్ చేసిన చారాణా రుణమాఫీ వడ్డీకి కూడా సరిపోలేదని, అదే తమ ప్రభుత్వం రూ.1.66 కోట్ల రుణమాఫీ చేసిందని తెలిపారు. వికారాబాద్‌లో ఒక్క రైతుకైనా బిఆర్ఎస్ రుణమాఫీ చేసిందా? అని ప్రశ్నించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కేటిఆర్ అబద్ధాలాడుతున్నారని రామ్మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి సమగ్ర కుటుంబ సర్వే ఎలా చేశారో చెప్పాలి

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

దమ్ముంటే మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి తమ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే ఎలా చేశారో చెప్పాలని ప్రభుత్వ సలహాదారు (మైనార్టీ, ఎస్‌సి, ఎస్‌టి) షబ్బీల్ అలీ సవాల్ విసిరారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ సర్వే రిపోర్ట్‌ను పదేళ్లు బయటపెట్టని కెసిఆర్ ముందుగా రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అబద్ధాల కెసిఆర్ తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నది చూడాలని ఎద్దేవా చేశారు. కెసిఆర్‌తో పాటు ప్రతిపక్ష నేతల సూచనలు కూడా తీసుకుని ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని స్పష్టం చేశారు. క్యాబినెట్ సబ్ కమిటీకి కాస్ట్ సెన్సెస్ మీద నివేదిక ఇచ్చిన నేపథ్యంలో ఆయన సిఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు అభినందనలు తెలిపారు. చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్‌కు ధన్యవాదాలు చెప్పారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చిన దమ్ము ధైర్యం ఎవరు చేయలేదని గుర్తుచేశారు. మోడీ ప్రభుత్వం తెచ్చిన ఇడబ్ల్యుఎస్10 శాతం రిజర్వేషన్ తో 50 శాతం సీలింగ్ దాటిందని గుర్తుచేశారు.

ఖమ్మంలో ఎన్‌ఎక్స్‌ప్లోరర్స్ కార్నివాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ : షెల్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వంతో మద్దతుతో స్మైల్ ఫౌండేషన్ ఖమ్మంలో ఎన్‌ఎక్స్ కార్నర్ కార్నివాల్‌ను నిర్వహించింది. గ్రామీణ పాఠశాలల విద్యార్థులు తమ శాస్త్రీయ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికను అందించాలనే లక్ష్యంతో దీన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపింది. దీనికి స్థానిక అడిషనల్ కలెక్టర్ పి శ్రీజ, డిఇఒ సోమశేఖర్ శర్మ హాజరయ్యారని పేర్కొంది. 13 పాఠశాలల నుండి 60 మంది విద్యార్థులు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం రంగాలలో ఎంపిక చేసిన 20 మార్పు ప్రాజెక్టులు, వినూత్న ఆలోచనలను కార్నివాల్‌లో ప్రదర్శించారని తెలిపారు.

కవితకు అనుమానాలుంటే ప్రభుత్వ దృష్టికి తేవాలి : మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

కులగణనపై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఏమైనా అనుమానాలుంటే ప్రభుత్వ దృష్టికి తెస్తే సరి చేస్తామని రాష్ట్ర వెనుకబడిన తరగతుల శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కల్వకుంట్ల కుటుంబంలో ఒక్క కవితనే వివరాలు సమర్పించారని తెలిపారు. మిగిలిన వారిని కూడా వివరాలు ఇవ్వాలని కవిత చెప్పాలని, వారెందుకు వివరాలు ఇవ్వలేదో ప్రశ్నించాలని సూచించారు. కులగణన సర్వేను తాము రహస్య ఎజెండా కోసం చేయలేదని, ఫ్రిడ్జ్‌లో, అల్మారాలో ఆ వివరాలను దాచిపెట్టబోమని ఎద్దేవా చేశారు.

కులగణన నివేదికలోని వివిధ అంశాలపై క్యాబినెట్ చర్చించి నిర్ణయం తీసుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కులగణనలో వివరాలు ఇవ్వని వారు ఇప్పటికైనా మండల స్థాయి అధికారులకు వివరాలు ఇవ్వాలని కోరారు. ప్రతిపక్ష పార్టీలు కూడా అభిప్రాయాన్ని అసెంబ్లీ సమావేశంలో తెలపాలన్నారు. బిసిలకు న్యాయం జరిగే సమయంలో ఎవరు అడ్డుకోవాలని చూసినా ఊరుకోమని హెచ్చరించారు. నిర్ణయం నుంచి నివేదిక వరకు వచ్చిన సర్కారు ఇక అడ్డొచ్చిన వారిని ఎదుర్కొని ముందుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు. అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు, బిసి సంఘాలు ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతూ, అభినందిస్తూ సంబరాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షనేత కెసిఆర్ ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం ప్రత్యేక ఆహ్వానం ఏమి ఉండబోదని స్పష్టం చేశారు. అసెంబ్లీ సెక్రెటరీ అందరూ ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు ఆహ్వానాలు పంపుతారని చెప్పారు. బిసిలపై చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ రేపు సభకు హాజరవుతారన్నారు. కొత్తగా ప్రభుత్వం సర్వే నిర్వహించక పాత సర్వే తో పని ఉండదని అభిప్రాయపడ్డారు.

యూనిట్ల సంఖ్య పెంచాలి

- దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి రుణాలివ్వాలి
- వికలాంగుల సహకార సంస్థ కార్యాలయం ఎదుట ఎన్‌పిఆర్‌డి ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

వికలాంగుల స్వయం ఉపాధి రుణాల యూనిట్ల సంఖ్యను పెంచాలనీ, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ రుణాలివ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని వికలాంగుల సహకార సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అసిస్టెంట్ డైరెక్టర్ అరుణకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వెంకట్, అడివయ్య మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిరుద్యోగ వికలాంగులకు స్వయం ఉపాధి కోసం ఇస్తున్న రుణాల యూనిట్ల సంఖ్యను ప్రతి మండలానికి 25 కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వేలాది మంది దరఖాస్తులు చేసుకుంటే 771 మందికి మాత్రమే రూ. 50 వేల చొప్పున రూ.3.55 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో రూ.50 వేల నుంచి రూ. మూడు లక్షల వరకు రుణాలు మంజూరు చేసే వారని గుర్తు చేశారు. ఇప్పుడు ఏకపక్షంగా రూ. 50 వేలు మాత్రమే రుణం మంజూరు చేయాలని యాక్షన్ ప్లాన్‌లో ప్రకటించటమేంటని ప్రశ్నించారు. వికలాంగుల కార్పొరేషన్‌కు రూ.50కోట్ల నిధులు వచ్చాయని ప్రచారం చేసుకుంటూ మరో వైపు యూనిట్ విలువ తగ్గించటంపై పలు అనుమానాలకు తావిస్తున్నదన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.50 వేలతో ఎలాంటి ఉపయోగముండదన్నారు. వ్యాపారం చేసుకోటానికి సరిపడా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన జిఒను వెంటనే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర నాయకులు కె చంద్రమోహన్, జె మల్లేష్, సుల్తాన్ రమేష్, లక్ష్మిపతి, శ్రీనివాస్, రమేష్, ఈశ్వర్, నర్సింహా, మోజెస్, సత్యలక్ష్మి, రియాజ్ బాషా, రాజమౌళి, నర్సింహులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలపై తప్పించుకునేందుకే ధర్నాలు

- బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

త్వరలో ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలున్న నేపథ్యంలో ఆరు గ్యారంటీలు అమలుచేయలేదని ప్రశ్నిస్తారనే భయంతో, వాటి నుంచి తప్పించుకునేందుకు కాంగ్రెస్ ధర్నాల నాటకం ఆడుతున్నదని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌పై తెలంగాణతో పాటు అన్ని రాష్ట్రాల ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. బడ్జెట్ ప్రవేశపెట్టే విధానం కాంగ్రెస్ నేతలకు అసలు తెలుసా? సోయి ఉండే మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరే బడ్జెట్‌లో లేదని విమర్శలు చేస్తున్నారు కదా.. స్టేట్ బడ్జెట్‌లో 33 జిల్లాల పేర్లు ప్రస్తావించారా? అని అడిగారు. మంగళవారం అసెంబ్లీ సాక్షిగా బిసిలను మోసం చేయాలని కాంగ్రెస్ సర్కారు చూస్తున్నదని విమర్శించారు. సర్వేలో బిసిల సంఖ్యను తగ్గించి చూపించి మోసం చేస్తున్నారని ఆరోపించారు. గతంలోనూ బిసిలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ఒక్కరోజు సమావేశం పెట్టి తూతూమంత్రంగా తీర్మానం చేసి ఆ నెపాన్ని ఇతరులపై నెట్టేయాలని చూస్తోందని విమర్శించారు. అసలు అసెంబ్లీ సమావేశాల్లో ఏం చేయదలుచుకున్నారో ముందుగానే అందరికీ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతర్గత సర్వేల్లోనూ ఆ పార్టీ సొంత నేతలే తిరుగుబాటు చేస్తున్నారని తేలిందన్నారు. సొంత పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేస్తున్న పరిస్థితి కాంగ్రెస్‌లో ఉందనీ, దొరికినంత దోచుకోవాలనే ప్లాన్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌కు దమ్ముంటే ఈ అసెంబ్లీ సమావేశాల్లో కేంద్ర బడ్జెట్ పై చర్చ జరపాలని సవాల్ విసిరారు. తెలంగాణకు కేంద్రం ఏమిచ్చిందో అక్కడ తాము చెబుతామన్నారు.

ప్రాణాలు తీస్తున్న కులదురహంకారం

- ప్రేమ పెళ్లిళ్లకు అడ్డుగోడగా కులం, మతం
- నీరుగారుతున్న చట్టాలు

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

ఒకరినొకరు ప్రేమించుకుని ఇష్టపడి పెళ్లి చేసుకునే సమయంలో కులం, మతం అడ్డుగోడగా నిలుస్తోంది. అయినప్పటికీ వాటిని ఎదిరించి పెండ్లి చేసుకున్న తర్వాత వారిని కులదురహంకార హత్యలు వెంటాడుతున్నాయి. కుల వ్యవస్థ నిర్మూలించాలని, అంటరానితనం రూపుమాపాలని పోరాడి సాధించుకున్న చట్టాలు నీరుగారుతున్నాయి. ఇప్పటికీ మెజార్టీ ప్రాంతాల్లో నిచ్చెనమెట్ల వ్యవస్థ, రెండు గ్లాసుల పద్ధతి, గుళ్లోకి రానివ్వకపోవడం లాంటి దురాచారాలు కొనసాగుతూనే ఉన్నాయి. టెక్నాలజీ పెరుగుతున్నా ఈ వివక్ష మాత్రం ఉంటూనే ఉంది. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నప్పటికీ వీటి నియంత్రణ జరగడం లేదు. ఈ క్రమంలో ప్రేమ వివాహాలు చేసుకుంటున్న జంటల విషయంలో కుల చిచ్చు రేగి హత్యలకు దారితీస్తోంది.

కొన్ని సంవత్సరాల కిందట మిర్యాలగూడలో జరిగిన ప్రణయ్ హత్యోదంతం తర్వాత సూర్యాపేట జిల్లాలో మరోటి జరిగింది. గత నెల 26న అర్ధరాత్రి వడ్లకొండ కృష్ణ అలియాస్ బంటిని దారుణంగా హత్య చేయడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉలిక్కిపడింది. దళిత సామాజిక తరగతికి చెందిన బంటి, బీసీ సామాజిక తరగతికి చెందిన భార్గవి ఆరు నెలలు కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. అది ఇష్టం లేని భార్గవి తండ్రి, నాయనమ్మ, అన్నలు కక్ష కట్టి పథకం ప్రకారం హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ హత్యను పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

జిల్లాలో నెలకు రెండు, మూడు ప్రేమ వివాహాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలోనూ పలు చోట్ల కులాంతర, మతాంతర వివాహాలు జరుగుతున్నాయి. కొందరు తల్లిదండ్రులు అంగీకరిస్తుండగా, మరికొందరు విభేదిస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబీకులు ఒప్పుకోని జంటలు ఇతర ప్రాంతాల్లోనో, రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలోనో పెండ్లి చేసుకుంటున్నాయి. కొన్నిచోట్ల ఈ ప్రేమ జంటలను విడగొట్టి కూతురు లేక కుమారుడిని తమ చెంతకు తెచ్చుకుంటున్నారు. వినని పక్షంలో హత్యలకు దిగుతున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో 2000 సంవత్సరంలో కులాంతర వివాహం చేసుకున్న ఓ గిరిజన యువకుడిని పట్టణ వ్యాపారి కక్షగట్టి హత్య చేసిన సంఘటన తెలిసిందే. పోలీసులు కేసును ఛేదించారు. అయినప్పటికీ కేసు నిలబడలేదు. ధన ప్రవాహంలో నిర్వీర్యమైంది. 2012లో తమ కుమార్తెను ప్రేమించాడని ఓ వ్యక్తి యువకున్ని హత్య చేశారు. ఈ కేసు విషయంలో పోలీసు ఉన్నతాధికారి కూడా బదిలీ అయ్యారు. అదేవిధంగా ఒక నగల వ్యాపారి కూతురు విషయంలో కూడా బెదిరింపులు ఎదురయ్యాయి. అబ్బాయిపై పోలీసులతో ఒత్తిడి చేయించారు. అయినా యువతి యువకుడి వైపు ఉండటంతో ఒత్తిడులు పనిచేయలేదు. రెండు సంవత్సరాల కిందట జిల్లా కేంద్రంలోని జనగామ క్రాస్‌రోడ్‌లో అదృశ్యమై అనుమానాస్పదంగా మృతిచెందిన దరావత్ నిఖిల్ కేసు నేటికీ మిస్టరీగానే మిగిలింది. ఇలాంటి సంఘటనలు వెలుగులోకి రానివి అనేకం ఉన్నాయి. కొన్ని కేసులు అంతర్గతంగానే రాజీ చేసుకొని బయటకి పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి.

నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాలు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో జరిగిన కులదురహంకార హత్యలు, సంఘటనలు చూసిన కొన్ని ప్రేమ జంటలు పెద్దలను ఎదిరించి వివాహాలు చేసుకోవడానికి భయపడుతున్నాయి. ప్రధానంగా కేసుల నమోదులో సెక్షన్లు పటిష్ఠంగా ఉండకపోవడంతో ఇరు గ్రూపులు స్టేషన్ బయట రాజీ చేసుకుంటున్నాయి. ఇలాంటి కేసులు పోలీస్ స్టేషన్లలో నిత్యకృత్యంగా మారాయి. కుల దురహంకార వ్యవస్థ నిర్మూలన కోసం "అంబేద్కర్" చూపిన బాటల్లో సిపిఎం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లాలో దాదాపుగా 50 మంది జంటలకు పైగా కులాంతర, మతాంతర వివాహాలు జరిపించారు. కులం, మతం అనేవి మనుషులు పెట్టుకున్న కట్టుబాట్లని, అవి ప్రేమ పెండ్లికి అడ్డుకాదని ఆ సంఘ నాయకులు తెలిపారు. తమ ఆధ్వర్యంలో వివాహాలు చేసుకున్న జంటలు పిల్లాపాపలతో ఎంతో అన్యోన్యంగా సంతోషంగా ఉంటున్నాయని చెబుతున్నారు. అదేవిధంగా, వారి తల్లిదండ్రులు కూడా రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు.

కుల వివక్ష నివారణకు ప్రత్యేక చట్టం తేవాలి
కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి

అంబేద్కర్ ఆశించిన కుల వివక్ష నిర్మూలన అమలుకు నోచుకోవడం లేదు. కులం, మతం నేడు ప్రేమికులకు అడ్డుగోడలుగా మారాయి. దీంతో హత్యలు పెరుగుతున్నాయి. చట్టాలు నీరు కారుతున్నాయి. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. కులాంతర వివాహాలకు బలం చేకూర్చేందుకు ప్రత్యేక చట్టాలు రావాలి. హత్యలకు పాల్పడినవారిని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలి. ప్రేమ జంటలకు రక్షణ కల్పించాలి. ఇప్పటికే కెవిపిఎస్ ఆధ్వర్యంలో 50కి పైగా కులాంతర, మతాంతర వివాహాలు జరిపించాం. నేడు వారంతా సంతోషంగా ఉన్నారు. నేటి తరానికి అనుగుణంగా పెద్దలు ఆచారాలను పక్కకు పెట్టి ప్రేమ పెళ్లిలను ఆశీర్వదించాలి, ఆదరించాలి.

మలేషియా పర్యాటకంలో దక్షిణాదినే కీలకం

ప్రజాశక్తి - హైదరాబాద్ : తమ పర్యాటకంలో భారత్‌లోని దక్షిణాది రాష్ట్రాలు కీలక వాటా కలిగి ఉన్నాయని మలేషియా టూరిజం డైరెక్టర్ జనరల్ దాతుక్ మనోహరన్ పెరియాసామి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తమ దేశానికి వచ్చే భారత పర్యాటకుల్లో 50 శాతం మంది దక్షిణాది రాష్ట్రాల నుంచే వస్తున్నారన్నారు. ఫిబ్రవరి 3-7 మధ్య హైదరాబాదు, బెంగళూరు, కొచ్చి వంటి ముఖ్యమైన నగరాల్లో మలేషియా టూరిజం రోడ్‌షోను నిర్వహిస్తున్నామన్నారు. 2024లో భారత్ నుంచి 10 లక్షల పర్యాటకులను ఆకర్షించామన్నారు. దక్షిణాది నుంచి వారానికి 151 విమానాలు అందుబాటులో ఉన్నాయన్నారు. టూరిజం మలేషియా చెన్నై కొత్త డైరెక్టర్ మృహిషాముద్దిన్ ముస్తఫా పాల్గొన్నారు.